



రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీ 12వ బ్లాక్ ద్వారా విడుదల అవుతున్న నీరు



జలకళ సంతరించుకున్న అవుకు రిజర్వాయర్

ఉధృతి పెరిగితే భద్రత అంతే..?

- అవుకు రిజర్వాయర్ స్లూయిస్ గేట్ల లీకేజీ
- తుప్పుబట్టిన గేట్లతో పొంచి ఉన్న ముప్పు
- కోతలకు గురవుతున్న మట్టికట్టలు
- ఆందోళనలో వివిధ గ్రామాల ప్రజలు

అవుకు, ఆగస్టు 12: అవుకు రిజర్వాయర్ భద్రత ప్రశ్నార్థకంగా మారిందా.. తాగు, సాగు నీరందించే ఆ పథకం నుంచి ప్రమాదం పొంచి ఉందా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అవుకు రిజర్వాయర్ నిర్మించి 14 ఏళ్లు కావడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో మట్టికట్టలు వర్షాలకు కోతకు గురవుతున్నాయి. స్లూయిస్ గేట్లు తుప్పుబట్టి లీకేజీ అవుతున్నాయి. నీటి ఉధృతికి స్పిల్‌వే గేట్లు ప్రమాదవశాత్తు తెరుచుకుంటే లోతట్టు గ్రామాలైన చెన్నంపల్లె, శివవరం, నిచ్చెనమెట్ల, అన్నవరం చిన్నకొట్టాల గ్రామాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే భద్రత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవుకు రిజర్వాయర్ నంద్యాల, కడప జిల్లాలకు వరప్రసాదిని. రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీ కాల్వ ద్వారా ఈ రెండు జిల్లాల్లోని 42,509 ఎకరాలకు సాగు నీరు, పలు గ్రామాలకు తాగు నీటిని అందిస్తోంది. ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ.36.50 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ ప్రాజెక్ట్ వాటర్ సప్లయ్ (సీపీడబ్ల్యూఎస్) స్కీంను నిర్మించారు. ఈ పథకం ద్వారా అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని 50 గ్రామాలకు ప్రతి రోజూ 40 లక్షల లీటర్లు (4ఎంఎల్‌డీ) తాగునీరు అందుతుంది. కొలిమిగుండ్ల మండలంలో నిర్మించిన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి రెండు సంవత్సరాల క్రితం నుంచి ప్రతి రోజూ 25 లక్షల లీటర్ల (2.5ఎంఎల్‌డీ) నీటిని రిజర్వాయర్ నుంచే తరలిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అవుకు రిజర్వాయర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాలేరు, స్పిల్‌వే స్లూయిస్‌ల నుంచి లీకేజీల పర్వం కొనసాగుతోంది. మూడంచెల భద్రతతో నిర్మించిన మట్టికట్టలు ముళ్లపొదలతో మూసుకపోయి కోతలకు గురవుతున్నాయి. అక్కడక్కడా రివిట్‌మెంట్ నుంచి నీరు లీకవుతోంది. గత వైసీపీ పాలనలో రిజర్వాయర్ నిర్వహణకు నిధులు మంజూరు కాక కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. ఎస్సార్బీసీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో రిజర్వాయర్ భద్రతపై రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా, మూడు టీఎంసీలు నీరు చేరే సరికే స్పిల్‌వే గేట్ల నుంచి భారీగా నీరు లీకవుతూ వృధాగా పోతోంది.

కోతకు గురైన మట్టికట్టలు



రిజర్వాయర్ నిర్మాణం



స్పిల్‌వే గేట్ల నుంచి లీకవుతున్న నీరు

పాలేరు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను కలుపుతూ 2001లో రిజర్వాయర్ నిర్మాణం పనులు చేపట్టారు. మొదటి దశ 1.86 టీఎంసీల నీటి సామర్థ్యంతో 2005లో రూపుదిద్దుకుంది. రెండో దశ పనులను 2005లోనే ప్రారంభించారు. 2010 నాటికి 4.148 టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం పూర్తయింది. రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు రెండు మార్గాలను ఏర్పాటు చేశారు. మొదటి మార్గం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి ఎస్సార్బీసీ కాల్వ ద్వారా 1500 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు చేరుతుంది. మరో మార్గం గోరుకల్లు నుంచి జీఎన్‌ఎస్‌ఎస్ ద్వారా 20 వేల క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వచ్చి చేరుతుంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రిజర్వాయర్‌ను నింపుతారు.

ఆయకట్టు విస్తీర్ణం ఇలా..

అవుకు రిజర్వాయర్ నుంచి ప్రారంభమయ్యే ఎస్సార్బీసీ కెనాల్ 116 కి.మీ నుంచి 141 కి.మీ అనగా కడప జిల్లా కొండసుంకేసుల వరకు సాగింది. ఈ ఎస్సార్బీసీ కెనాల్‌ను 12-16 బ్లాకులుగా విభజించి 42,509 ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. 12వ బ్లాక్ కింద సంగపట్నం, అవుకు, శింగనపల్లె, శివవరం, ఆకుమల్ల, వసంతాపురం, చెన్నంపల్లె, నిచ్చెనమెట్ల గ్రామాల పరిధిలో 8,039 ఎకరాలు, 13వ బ్లాక్ కింద చనుగొండ్ల, సుంకేసుల, కాశీపురం, బొందలదిన్నె, ముక్కమళ్ల, ముదిగేడు, ఎగ్గోని గ్రామల పరిధిలో 13,088 ఎకరాలు, 14వ బ్లాక్ పరిధిలో ఆల్వకొండ, సుంకేసుల, ముచ్చలపురి, సంజామల, కానాల గ్రామాల పరిధిలో 9,020 ఎకరాలు, 15వ బ్లాక్ పరిధిలో కొత్తపల్లి, గిద్దలూరు, మంగపల్లి గ్రామాల పరిధిలో 6,164 ఎకరాలు, 16వ బ్లాక్ కింద ఉయ్యాలవాడ, తుడమలదిన్నె, ఆర్.లింగందిన్నె, అల్లూరు, కడప జిల్లా కొండసుంకేసుల గ్రామాల పరిధి వరకు 6,198 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. అలాగే రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు కింద 1,614 ఎకరాలు, పాలేరు చెరువు కింద 665 ఎకరాల లోకల్ ఆయకట్టుకు నీరు అందుతుంది. గొల్లలేరు నుంచి డ్రైన్ కింద అవుకుతోపాటు లోతట్టు గ్రామాల పరిధిలో 8,100 ఎకరాలకు సాగు నీరు సరఫరా అవుతుంది.

రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు

రిజర్వాయర్‌లో నీటి మట్టం 216.5 మీటర్లకు(1.05 టీఎంసీలు) చేరి ఎస్సార్బీసీ 12వ బ్లాక్ నుంచి ఆయకట్టుకు 219.5 మీటర్లు (1.85 టీఎంసీలు) చేరితే చెర్లోపల్లె గ్రామ సమీపంలో నిర్మించిన జీఎన్‌ఎస్‌ఎస్ హెడ్‌రెగ్యులేటర్ నుంచి కడప జిల్లాకు నీటిని విడుదల చేస్తారు. ఈ నీటితో మైలవరం, గండికోట డ్యామ్‌లను నింపుతారు. రిజర్వాయర్‌లో 227 మీటర్లు (4.148టీఎంసీలు) ఎఫ్‌ఎల్‌ఆర్‌కు చేరిన పరిస్థితుల్లో స్పిల్‌వే గేట్ల ద్వారా గొల్లలేరు డ్రైన్‌కు నీటిని విడుదల చేస్తే కుందూలో కలుస్తుంది.

రిజర్వాయర్‌కు పొంచి ఉన్న ముప్పు

రిజర్వాయర్ నిర్మాణం జరిగి 14 ఏళ్లు దాటింది. మూడంచెల భద్రతతో నిర్మించిన మట్టికట్టలు వర్షాలకు కోతకు గురవుతున్నాయి. స్లూయిస్ గేట్లు మరమ్మతులకు నోచుకోక తుప్పుబట్టి పోతున్నాయి. పాలేరు, స్పిల్‌వే స్లూయిస్ లీకేజీలు రైతులను కలవర పెడుతున్నాయి. 2015లో డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ బృందం రివిట్‌మెంట్, స్లూయిస్ లీకేజీలను అధ్యయనం చేసి వెళ్లినా ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. 2022లో స్పిల్‌వే స్లూయిస్‌ల మరమ్మతుల కోసం రూ.2.01 కోట్లు, పాలేరు స్లూయిస్ మరమ్మతులకు రూ.45 లక్షలతో ప్రణాళికలు రూపొందించి గతంలోని వైసీపీ ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఆ ప్రణాళికలు ప్రకటనలకు పరిమితమయ్యాయి. రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉన్నపుడు నీటి ఉధృతికి స్పిల్‌వే గేట్లు ప్రమాదవశాత్తు తెరుచుకుంటే లోతట్టు గ్రామాలైన చెన్నంపల్లె, శివవరం, నిచ్చెనమెట్ల, అన్నవరం చిన్నకొట్టాల గ్రామాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జలవనరుల శాఖ ఉన్నతాధికారులు స్పందించి అవుకు రిజర్వాయర్ భద్రతపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని పాలేరు స్లూయిస్



మట్టికట్టలు కోతలకు గురైతే ప్రమాదం



మూడంచెల భద్రతతో నిర్మించిన మట్టికట్టలు వర్షాలకు కోతకు గురవుతున్నాయి. పాలేరు చెరువు మట్టికట్టలు ముళ్లపొదలతో అల్లుకుపోయాయి. రిజర్వాయర్‌పై ఎస్సార్బీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. మట్టికట్టలు కోతలకు గురికాకుండా చర్యలు చేపట్టాలి.

- కొండమీది రామచంద్రుడు, రైతు, అవుకు

స్లూయిస్‌లకు మరమ్మతులు చేపట్టాలి



రిజర్వాయర్‌లో అంతర్భాగమైన పాలేరు, స్పిల్‌వే స్లూయిస్‌ల ద్వారా నీరు లీకవుతోంది. స్పిల్‌వే గేట్లు రిజర్వాయర్ భద్రతకు కీలకం. లీకేజీలతో గేట్లు తుప్పుబట్టి పోతున్నాయి. ప్రమాదవశాత్తు గేట్లు తెరుచుకుంటే లోతట్టు గ్రామాలు మునకకు గురవుతాయి. ఎస్సార్బీసీ అధికారులు స్లూయిస్‌లకు మరమ్మతులు చేపట్టాలి.

- బుగ్గ శ్రీనివాసులు, రైతు, అవుకు

రిజర్వాయర్‌కు భద్రత కరువు



రిజర్వాయర్ నుంచి వేల ఎకరాలకు సాగు నీరు వందల గ్రామాలకు తాగునీరు అందుతోంది. అధికారులు రూపొందిస్తున్న ప్రణాళికలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. మరమ్మతులు చేపట్టి రిజర్వాయర్ భద్రతకు ముప్పు వాటిల్లకుండా చర్యలు చేపట్టాలి.

-మిద్దె రామాంజి, రైతు, అవుకు



ముళ్లపొదలతో మూసుక పోయిన రిజర్వాయర్ మట్టికట్టలు

పీజీఆర్ఎస్‌కు 110 ఫిర్యాదులు

విచారణ జరిపి న్యాయం చేస్తాం : ఎస్పీ



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, ఆగస్టు 12 : నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 110 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి నుంచి అర్జీలు స్వీకరించి వివరాలు తెలుసుకొని సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై సాధ్యమైనంత త్వరగా చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశించారు. చట్టపరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, ఫిర్యాదులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సివిల్ తగాదాలు, అత్తారింటి వేధింపులు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితర సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో నంద్యాల డీఎస్పీలు ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి, రమాకాంత్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి: కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 12: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలు నిర్ణీత గడువులోగా పరిష్కరించకపోవడం వల్లే గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయి దాటి అమరావతికి వెళ్లి గ్రీవెన్స్ ఇస్తున్నారన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేయండి

నంద్యాలలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, అవార్డు స్వీకర్తలకు ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్డీఓను ఆదేశించారు.

15 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

- సెప్టెంబరు 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలి
- కలెక్టర్ రాజకుమారి



గ్రామ రెవెన్యూ సదస్సులపై మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 12: జిల్లాలో ఈ నెల 15 నుంచి సెప్టెంబరు 31 వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు పగడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా పరిష్కార వేదికలో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15న రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభిస్తుందన్నారు. ఈ సదస్సుల పరిశీలనకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించబోతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సులకు జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. రైతులకు పంపిణీ చేసిన భూహక్కు పత్రాలను వెనక్కి తీసుకొని వాటి స్థానంలో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూ ఆక్రమణలు, 22ఏ భూముల తోపాటు, పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. సదస్సులకు హాజరయ్యే రెవెన్యూ బృందాలు ఆర్ఓఆర్, అడంగల్, సంబంధిత రెవెన్యూ రికార్డులను వెంట తీసుకెళ్లాలని ఆదేశించారు. అలాగే ఆగస్టు 15న అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్వో పద్మజ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : మంత్రి బీసీ



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, ఆగస్టు 12 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రతి సోమవారం బనగానపల్లెలోని ఇంటి వద్ద ఉన్న కార్యాలయంలో మంత్రి బీసీ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరిస్తున్నారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి వినతి పత్రాలు మంత్రికి అందజేశారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పంపుతూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. జటిలమైన సమస్యలను మంత్రి స్వయంగా సమీక్షించి పరిష్కారం దిశగా కృషి చేస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెచ్చులూడి విద్యార్థినులకు గాయాలు



పరామర్శిస్తున్న డీఈవో





చికిత్స పొందుతున్న విద్యార్థినిలు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 12: నంద్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తరగతి గది భవనం పెచ్చులూడి తొమ్మిది మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. వీరిలో నలుగురికి బలమైన గాయాలు ఐదుగురికి మాత్రం స్వల్ప గాయాలయ్యాయి. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 3వ అంతస్తులో ఉన్న 7వ తరగతి విద్యార్థినులపై సీలింగ్ పీవోపీ పెచ్చులూడి విద్యార్థినులపై పడటంతో గాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎంఈవో బ్రహ్మం, డీఈవో సుధాకరరెడ్డి, టూటౌన్ సీఐ రాజారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌లు ప్రమాద స్థలికి చేరుకుని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలందించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. విద్యార్థి సంఘాల నాయకులు ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఘటనపై డీఈవో విచారించి పాఠశాలల ఆర్జేడీ శ్యామ్యూల్‌కు నివేదికలు పంపించారు. విద్యార్థులకు ప్రమాదం తప్పడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీశైల జలాశయం గేట్ల మూసివేత

శ్రీశైలం, ఆగస్టు 12: శ్రీశైలం జలాశయం క్రస్టు గేట్లను డ్యాం అధికారులు సోమవారం సాయంత్రం మూసివేసి వేశారు. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జలాశయం గేట్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల జలాశయం నుంచి వరద ప్రవాహం నిలిచిపోయింది. సుంకేసుల నుంచి 77,598 క్యూసెక్కులు వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 881.20 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 194.3096 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,671 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,540 క్యూసెక్కుల మొత్తం 68,211 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



స్వామి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

కౌతాళం, ఆగస్టు 12: ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం నుంచే భక్తులు తరలి రావడంతో రద్దీని దృష్టిలో ఉంచుకుని 24 గంటల పాటు దర్శనం కల్పించారు. ఉదయం నుంచి స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య అంతకంతకు పెరిగిపోవడంతో ఆలయంలోని క్యూలైన్లు నిండిపోయి గంటల తరబడి దర్శనానికి సమయం పట్టింది. వాహనాల రద్దీతో అన్ని రూట్లలో ట్రాఫిక్ పెరిగిపోయింది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఆలయ జీర్ణోద్ధరణ పనులకు సి. బెళగల్ వాస్తవ్యులు మంగమ్మ, గ్రామ ప్రజలు రూ.52,640 దేవాలయ కార్యాలయంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్‌కు అందజేసినట్లు డిప్యూటీ కమిషనర్, ఈఓ గురుప్రసాద్ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, డీఆర్వో మధుసూదన్‌రావు, డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 12: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 'నషా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎంబీఏ) కార్యక్రమాన్ని (వీక్షిత్ భారత్ కా మంత్ర భారత్ హో నషే సే స్వతంత్ర' అనే థీమ్‌తో ప్రారంభించినట్లు తెలిపారు. దేశంలో యువశక్తి ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నదని, అలాంటి యువత మత్తుకు బానిస కాకూడదన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనకు వ్యతిరేకంగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

హొళగుంద, ఆగస్టు 12: హొళగుంద మండల పరిధిలోని ముగుమానుగుంది గ్రామానికి చెందిన అంజనప్ప (22) అనే యువకుడు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. అంజనప్ప ఉదయం 10 గంటల సమయంలో గొర్రెలకు వేపాకుల మేత వేసేందుకు వెళ్లాడు. గొర్రెల దొడ్డిపై 11 కేవీ విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండి వేపకొమ్మలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ అస్పత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య రాజమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని హొళగుంద విద్యుత్ అధికారి ఓబుళమ్మ పరిశీలించారు.

నవోదయ విద్యాలయంలో స్కిప్పింగ్ పోటీలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు12: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో స్కిప్పింగ్(తాడు దాటడం)పోటీలను విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవోదయ పాఠశాల పూర్వ విద్యార్థి, సీఐ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ప్రిన్సిపాల్ పద్మావతి, సీఐ మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ఈ పోటీలను 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మన్న, వైస్ ప్రిన్సిపాల్ చందీరన్, కె. బసవరాజు, ఎర్రిస్వామి, శ్రీలక్ష్మీ, జగన్నాథ్, శిరీష శ్రీనివాసరావు, వెంకటేష్, అంజలి, నబి పాల్గొన్నారు.

రాత్రిపూట రెవెన్యూ రికార్డుల తరలింపు



రికార్డులు తీసుకెళ్తున్న ప్రైవేట్ వ్యక్తి

హొళగుంద, ఆగస్టు 12: హొళగుంద తహసీల్దార్ కార్యాలయంలో ఓ ప్రైవే ట్ వ్యక్తి రాత్రి 9:30 గంటల సమయంలో రికార్డులను తీసుకెళ్లినట్లు తలారులు సిద్దలింగ, మల్లయ్య సోమవారం తెలిపారు. ఆర్ఐ గదిలోని బీరువాలో ఉన్న రికార్డులను తీసుకువెళ్తుండగా తమను బెదిరించి తహసీల్దార్ చెప్పాడంటూ తీసుకెళ్లినట్లు తెలిపారు. రికార్డులు తరలించే దృశ్యాలను తలారులు వీడియో రికార్డు చేసి తహసీల్దారుకు వాట్సాప్‌లో పంపించామని చెప్పారు. దీంతో ఎస్ఐకి తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. తహసీల్దార్ ఏఎం ప్రసాద్ రాజును వివరణ కోరగా రికార్డులు తీసుకెళ్లమని తాను ఎవరికీ చెప్పలేదని తెలిపారు.

అటవీ ప్రాంతంలో యువకుడి మృతదేహం

పాణ్యం, ఆగస్టు 12 : ఎస్సార్బీసీ మెయిన్ కెనాల్ సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని గుర్తించినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. పాణ్యం పోలీసు స్టేషన్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఎస్సార్బీసీ కెనాల్ సమీపంలోని తాటికాయ ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో సోమవారం ఉదయం గుర్తు తెలియని 30 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు గల యువకుని మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. యువకుని గొంతుపై, తలపై గాయాలు ఉన్నట్లు తెలిపారు. మృతుడు కట్ బనియన్, జీన్స్ పాంటు ధరించాడని చెప్పారు. పాణ్యం వీఆర్ఓ విజయ్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జి సీఐ వంశీధర్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

యువకుని మృతిపై పలు అనుమానాలు ?

యువకుని మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొంతు వద్ద తుపాకీతో కాల్చి చంపినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. దీనికితోడు మృతుని తల పక్కన పోలీసులకు తూటా కూడా దొరికినట్టు తెలుస్తోంది. హంతకులు ఎక్కడో చంపి ఇక్కడ తెచ్చిపడేసినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. తూటా కాక్‌పై ఉన్నతాధికారులు తీవ్రంగా దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. యువకుని సెల్‌ఫోన్ ఆదారంగా మృతుని పేరు సునీల్ కుమార్‌గా, అనంతపురం జిల్లా వాసిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపడితే మృతి వెనుక గల కారణాలు తెలిసే అవకాశం ఉంది.

ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద భారీ భద్రత

కోసిగి, ఆగస్టు 12: ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ నిత్యానంద రాజు తెలిపారు. సోమవారం ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌తో ఆనకట్ట వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ నిత్యానందరాజు వరద ప్రవాహం గమనిస్తూ ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. నదిలో నీరు అధికంగా ఉండటంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, రైతులు కూడా నదిలోకి వెళ్లవద్దని, గొర్రెల కాపరులు అటు వైపు వెల్లవద్దని సూచనలు చేశారు. ఈయన వెంట వీఆర్వో బసవరాజు, తలారీలు, గ్రామస్థులు, ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్ సభ్యులు ఉన్నారు.

మఠానికి విరాళంగా మూడు వేల మొక్కలు

మంత్రాలయం, ఆగస్టు 12: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి 8 లక్షల విలువ చేసే మూడు వేల మొక్కలను విరాళంగా దాత అందజేశారు. సోమవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు మొక్కలను చూపించారు. నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన దాత బద్రీనాథ్ తన నర్సరీలో పెంచుకుంటున్న పూల మొక్కలు, పండ్ల మొక్కలు, ల్యాండ్ స్కేపింగ్ మొక్కలు, అలంకరణ అందంగా ఉండే మొక్కలను ప్రత్యేక లారీతో మంత్రాలయానికి తీసుకువచ్చారు. బద్రినాథ్ సొంతంగా కూలీలను ఏర్పాటు చేసి నది తీరంలో ఉన్న తులసి వనం, గురునివాస్, గురుసార్వభౌమ సాంస్కృతిక విద్యాపీఠం, పరిమళ విద్యానికేతన్, పద్మనాథ తీర్థ గెస్టు హౌస్, వివిద అతిథి గృహాల్లో ఉచితంగా మొక్కలు నాటి డిజైన్ చేసే బాధ్యతను తీసుకున్నాడు. దాత బద్రినాథ్‌ను మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ముదురుతున్న దేవాలయ స్థల వివాదం

- మాదేంటున్న ఆలయ కమిటీ సభ్యులు, వెల్డింగ్ షాపుల యజమానులు
- మున్సిపాల్టీకి చెందిన స్థలంపై ఎవరి ఆధిపత్యం తగదన్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
- సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు ఆదేశాలు



రోడ్డుపైన బైఠాయించిన రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయ కమిటీ సభ్యులు

నందికొట్కూరు, ఆగస్టు 12: నందికొట్కూరు పట్టణంలో రుక్మిణి పాండురంగస్వామి దేవాలయ స్థల వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఆదివారం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి భూమి పూజ చేసేందుకు వెళ్లగా సీపీఎం నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వివాదం ప్రారంభమైంది. రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయానికి 27 సెంట్లు నందికొట్కూరు గ్రామపంచాయతీ తీర్మానంతో తీసుకున్నామని కమిటీ సభ్యులు ఆధారాలను చూపుతున్నారు. గ్రామపంచాయతీ ఇచ్చిన స్థలంపై మున్సిపాల్టీకి ఎలాంటి హక్కు లేదని వారు వాదిస్తున్నారు. అదే క్రమంలో వెల్డింగ్ కార్మికులు కూడా తాము కూడా గత కొంత కాలంగా దుకాణాలు వేసుకొని మున్సిపాల్టీకి పన్ను చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నామని వారు చెబుతున్నారు. కాబట్టి తమ స్థలం తమకు కేటాయించాలంటూ వెల్డింగ్ కార్మికులు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు సోమవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరుగుతున్న సమయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ నాయకుడు నరసింహులుతో పాటు వెల్డింగ్ కార్మికులు మాట్లాడుతూ దేవాలయ కమిటీ సభ్యులు బంకులను తొలగిస్తూ



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు నరసింహులు, వెల్డింగ్ కార్మికులు

కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని, ఆ పనులను వెంటనే అడ్డుకొని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాల్టీకి చెందిన స్థలంపై దేవాలయ కమిటీ సభ్యులు, వెల్డింగ్ కార్మికుల పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. ఈ స్థల వివాదంపై విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆయన కమిషనర్ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ రాజకుమారితో నంద్యాలలో చర్చించారు. కాగా దేవాలయాల భూములను కాపాడుకుంటామని విశ్వహిందూపరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు.

ఎర్రకోట వేడుకలకు మద్దికెర విద్యార్థి



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం అజరయ్ బాబు

మద్దికెర, ఆగస్టు 12: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే పంద్రాగస్టు వేడుకలకు మద్దికెర గ్రామానికి చెందిన విద్యార్థి యు. పవన్ కుమార్ ఎంపికయ్యారు. స్థానిక ఉప్పరవీధిలో నివసించే యు. పవన్ కుమార్ 10వ తరగతి స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో చదువుకుంటున్నాడు. పవన్ కుమార్ ఢిల్లీలో ఎర్రకోట పరేడ్ మైదానంలో జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ ఏడాది జూన్ 1న గుజరాత్‌లో జరిగిన ప్రేరణ కార్యక్రమంలో ఎంపిక కావడంతో విద్యార్థికి ఈ అవకాశం వచ్చిందని ప్రిన్సిపాల్ అజరయ్‌బాబు, యు. శ్రీనివాసులు అభినందించారు.

గాజులపల్లి రైతు భరోసా కేంద్రంలో చోరీ

మహానంది, ఆగస్టు 12: మహానంది మండలం గాజులపల్లి -1 రైతు భరోసా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆర్‌బీకే తలుపులకు వేసిన తాళాలను పగలకొట్టి కార్యాలయంలోని విలువైన కంప్యూటర్‌ను దొంగలించుకొని వెళ్లినట్లు తెలిపారు. సోమవారం ఉదయం విధులకు హాజరైన సిబ్బంది రైతు భరోసా కేంద్రం తలుపులు పెకిలించి ఉండటం గమనించి విషయాన్ని తన దృష్టికి తెచ్చారని చెప్పారు. చోరీకి గురైన కంప్యూటర్, పరికరాల విలువ రూ.80 వేలు ఉంటుందని తెలిపారు. మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏవో చెప్పారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొత్తపల్లి, ఆగస్టు 12: కొత్తపల్లికి చెందిన గూడెం స్వాములు (39) అనే వ్యక్తి వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శేషారామ్‌సింగ్ వివరాల మేరకు.. కొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన గూడెం స్వాములుకు ఆత్మకూరు పట్టణానికి చెందిన విజయమ్మతో సుమారు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి తరచూ మద్యం సేవిస్తుండేవాడు. ఇటీవల మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం కూడా గూడెం స్వాములు మద్యం సేవించి అదే కాలనీలోని ఓ వేప చెట్టుపైకి ఎక్కి పైభాగాన ఉన్న కొమ్మకు తాడుతో గొంతుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య విజయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

మహానందిలో అనంతపురం జిల్లా న్యాయాధికారి పూజలు



జడ్జి శోభారాణి కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

మహానంది, ఆగస్టు 12: మహానంది క్షేత్రంలో సోమవారం అనంతపురం జిల్లా న్యాయాధికారి శోభారాణి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయం ముఖ మంటపం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరునికి కుంకుమార్చన, అభిషేకాలను నిర్వహించారు. కల్యాణమంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించి, ప్రసాదాలను అందజేశారు.

ఆల్బెండజోల్ టాబ్లెట్స్ మింగించండి

కలెక్టర్ రాజకుమారి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, సంబంధిత అధికారులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 12: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో చదువుతున్న 1-19 సంవత్సరాలలోపు పిల్లలందరితో ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను నమిలి మింగించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలనపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో నులిపురుగుల గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా రక్త హీనతకు గురయ్యే ప్రమాదాన్ని నివారించేందుకు పిల్లలందరితో ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌ను మింగించాలని అన్నారు.

●బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు.

వైసీపీ వాళ్లలా కక్ష రాజకీయాలు చేయొద్దు

సమావేశంలో కన్నీరు కార్చిన మహిళా సర్పంచ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదోని రూరల్, ఆగస్టు 12 : గత ప్రభుత్వంలా కక్షతో రాజకీయాలు చేయవద్దని దొడ్డనగేరి సర్పంచు పార్వతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళిక మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా, సోమవారం స్థానిక ఎంపీపీ భవన్‌లో ఎమ్మెల్యే పార్థసారధి అధ్యక్షతన ఆయా గ్రామాల సర్పం చులకు శిక్షణ ఇచ్చారు. వైసీపీలాగా కక్ష రాజకీయాలు చేయొద్దని, పంచాయతీ నిధులన్నీ గతంలో జగన్ దొంగలించాడని, వైసీపీ, సాయిప్రసాద్‌రెడ్డిలా మీరు చేయొద్దని కన్నీరు కారుస్తూ, దొడ్డనగేరి సర్పంచు పార్వతమ్మ ఎమ్మెల్యే పార్థసారధికి సూచించారు. ఎంపీపీ బడాయి దానమ్మ, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఎంపీడీవో గీతావాణి, ఈఓపీఆర్‌డీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, ఆగస్టు 12 : తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టులపై సాంకేతిక నిపుణులతో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోని ప్రాజెక్టులకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని, ప్రాజెక్టులను బాగు చేయడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని పేర్కొన్నారు. అలగనూరు రిజర్వాయర్ కట్టలకు కోతలు, గోరుకల్లు రిజర్వాయర్ రివిట్‌మెంట్ ఇబ్బందులు, వెలుగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మసాగర్‌కి నీరు చేర్చే ప్రధానమైన మద్రాసు కాలువ నిర్వహణ లోపాలు, 2009 వరదలతో సుంకేసుల నుంచి కేసీ ప్రధాన కాలువ బలహీనపడటం, సుంకేసుల బ్యారేజి గేట్లు, పోతిరెడ్డిపాడు రిజర్వాయర్ గేట్లు, అన్నమయ్య ప్రాజెక్టు, శ్రీశైలం రిజర్వాయర్ ప్లంజ్ పూల్, హంద్రీ-నీవా ప్రధాన కాలువలు, గాలేరు -నగరి ప్రాజెక్టుతో సహా రాయలసీమ వ్యాప్తంగా వివిధ రిజర్వాయర్లు, బ్రాంచ్, పంట కాలువల రూపురేఖలు కూడా లేకుండాపోవడం, పీపీబీఆర్ నిర్వహణ, అనేక చెరువుల గట్లు బలహీన పడటం, కృంగిపోవడం, గురురాఘవేంద్ర ప్రాజెక్టులోని ఎత్తిపోతల పథకాలు, చెరువులకు నీరు అందించే వాగులు, వంకల, కాలువల వ్యవస్థ క్షీణించడం తదితర అనేక సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకపోయిన నేపథ్యంలో నిపుణులతో స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు

చిప్పగిరి, ఆగస్టు 12: చిప్పగిరి కుందనగుర్తి మధ్య సోమవారం జరిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కుందనగుర్తి గ్రామానికి చెందని కురువ గాది లింగ, మునిగిరి పెద్దయ్య ద్విచక్ర వాహనంపై చిప్పగిరి రైతు సేవా కేంద్రానికి వెళ్తుండగా గుంతకల్ నుంచి ఆలూరుకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. 108 వాహనంలో వీరిని గుంతకల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నులి పురుగుల నివారణతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 12: అల్బెండజోల్ మాత్రలతో నులి పురుగుల నివారణ జరిగి చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, దీనికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా వైద్య, అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రతి సంవత్సరం రెండుసార్లు (ఫిబ్రవరి 10న, ఆగస్టు 10 తేదీల్లో) నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతరలా చేపల వేట





శ్రీశైలం, ఆగస్టు 12: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో అధికారులు సోమవారం గేట్లు మూసివేశారు. దీంతో మత్స్యకారులు ఒక్కసారిగా చేపల వేటకు జలాశయానికి బయలుదేరి వెళ్లారు. పది రోజులుగా భారీ వరద ప్రవాహం వస్తుండడం, జలాశయం పది గేట్లు ఎత్తడంతో చేపల వేటపై నిషేధించారు. సోమవారం జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో వలలు సిద్ధం చేసుకొని వేటకు మొదలుపెట్టారు. దీంతో నదిలో పడవల సందడిగా మారింది.

ఆవుల యజమానిపై ఎఫ్‌బీవో దాడి



దాడిలో గాయాలపాలైన చంద్రయ్య

కొత్తపల్లి, ఆగస్టు 12: కొత్తపల్లి మండలం ముసలిమడుగు అటవీ ప్రాంతంలో ఆవులు మేపుకుంటున్న జంగాల చంద్రయ్యపై ముసలిమడుగు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీవో) పాములేటి విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. బాధితుడు చంద్రయ్య కొత్తపల్లిలో విలేకరులతో తమ గోడు వెలిబుచ్చాడు. సోమవారం ఉదయం చంద్రయ్య తన ఆవుల మందను అటవీ సమీపంలోని గార్లదిన్నె, దోవకుంట పరిసర ప్రాంతాల్లో మేపుకుంటున్నాడు. ఉన్న ఫలంగా ఎఫ్‌బీవో పాములేటి ప్రొటెక్షన్ వాచర్లతో కలిసి ఆవులను అటవీ ప్రాంతంలో ఎలా మేపుతావంటూ కర్రతో విచక్షణారహితంగా కొట్టాడని కన్నీరు మున్నీరయ్యాడు. ఆవులు మేపుకునేందుకు ప్రతి ఏడాది అటవీ అధికారులకు చలానా కూడా చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశాడు. ఈ ఘటనపై ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్పందిస్తూ చంద్రయ్యపై దాడి చేసిన ఫారెస్టు సిబ్బందిపై కేసు నమోదు చేయాలని అన్నారు. సోమవారం ఆయన మండలంలోని సింగరాజుపల్లెలో ఓ వివాహ వేడుకలకు హాజరు కాగా బాధితుడు తన గోడు విన్నవించుకున్నాడు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సదరు అధికారిపై చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని అక్కడే ఉన్న పోలీసు అధికారులను ఆదేశించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'మత్స్యకారులను ఆదుకోవాలి'



ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

గడివేముల, ఆగస్టు 12: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని సోమవారం బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు పీజీ వెంకటేష్, ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గని గ్రామంలోని మత్స్యకార సంఘంలో దాదాపు 200 కుటుంబాలు చేపల వేట వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కానీ మత్స్యకార సంఘంలో కొత్త సభ్యులను చేర్చుకోవడం లేదన్నారు. దీంతో ఎంతో మంది మత్స్యకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోతున్నారన్నారు. మత్స్యకారుల సమస్యలపై దృష్టి సారించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. తప్పనిసరిగా మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరిత హామీ ఇచ్చారు. ముని, వెంకట రమణ, ఈశ్వర్, మద్దిలేటి, సామన్న, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'

గడివేముల, ఆగస్టు 12: విద్యారంగంలో నెలకొన్న, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి మానపాటి రవి కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ శాస్త్రీయత లేని ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, నాగన్న, గడివేముల మండల శాఖ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

'శ్మశానానికి స్థలం కేటాయించాలి'

జూపాడుబంగ్లా, ఆగస్టు 12: 80బన్నూరు గ్రామంలో ఉన్న శ్మశానం జాతీయ రహదారి నిర్మాణంలో పోవడంతో శ్మశానంలేదని సోమవారం కేజీ రోడ్డుపై దళితులు ధర్నా చేపట్టారు. గ్రామంలో ఓవ్యక్తి మృతిచెందడంతో ఖననం చేయడానికి స్థలంలేదని ఆందోళన చేపట్టారు. స్థలం కేటాయించేవరకు ధర్నా విరమించేది లేదని భీష్మించి కూర్చున్నారు. గంట పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ పాల్గొని ఆందోళన విరమించాలని కోరారు. స్థలం కేటాయించేవరకు ఆందోళన విరమించబోమని అధికారులపై మండిపడ్డారు. నెలరోజుల నుంచి చెబుతున్న పట్టించుకోకపోవడంతో ధర్నా చేస్తున్నామని అన్నారు. నెలరోజుల్లో సమస్య పరిష్కరిస్తామని, అప్పటి వరకు ఎక్సకవేటర్‌తో కంపచెట్లను తొలగించి మృతదేహాన్ని పూడ్చుకోవాలని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

రేషనలైజేషన్‌ను రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 12: రేషనలైజేషన్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని అనంతరం జీవో నంబర్ 53 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు రపాలని విజ్ఞప్తి చేశారు. జీవో నంబర్ 117ను వెంటనే రద్దు చేసి 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు.ఎన్నికల ముందు నారాలోకేష్ ఇచ్చిన హామి ప్రకారం 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని, ప్రస్తుత ప్రభుత్వం గాడిన పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వజవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, జిల్లా కౌన్సిలర్లు రంగనాయకులు, ఆదినారాయణ, పుల్లయ్య సైపుల్లా తదిరతులు పాల్గొన్నారు.

'కనీస సౌకర్యాలు కల్పించాలి'

మహానంది, ఆగస్టు 12: మహానంది క్షేత్రంలో దైవదర్శనం కోసం వచ్చే భక్తుల సమస్యలు పరిష్కరించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని మహానందీశ్వర పరిరక్షణ సమితి సభ్యులు సోమవారం కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. నంద్యాల కలెక్టరేట్ జరిగిన ప్రజా సదస్సులో పరిరక్షణ సమితి సభ్యులు కాకర్ల శివ, దూదేకుల మురళి, వెంకటరమణ క్షేత్రంలో భక్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా పోచా విశ్రాంతి భవనం భక్తులకు ఏవిధంగా ఉపయోగపడటం లేదన్నారు. అలాగే ఆలయంలో భక్తుల నిలువు దోపిడీని నివారించాలని కోరారు. క్షేత్ర పరిసరాల్లో, పంచాయతీ పరిధిలోని కల్యాణమంటపాల వద్ద కూడా డస్ట్ బిన్‌లు ఉపయోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

ఆత్మకూరు, ఆగస్టు 12: క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఒక మున్సిపల్ ఉద్యోగుల జట్టు, రెండు వార్డు సచివాలయ ఉద్యోగుల జట్లకు క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించి సచివాలయ ఉద్యోగుల జట్టు విజయం సాధించింది. కమిషనర్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని చెప్పారు. అదేవిధంగా వ్యక్తుల, ప్రాంతాల మధ్య కూడా క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడలను కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్ సందర్శించారు.

వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైలం, ఆగస్టు 12: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలం కరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులుజేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన

పాణ్యం, ఆగస్టు 12: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను హయ్యర్ ఎడ్యుకేషన్ ఇబ్బందులకు గురి చేస్తోందని విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్ ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులు కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ప్రవేశాలలో ఈ ఏడాది 27 మందికి సీట్లు కేటాయించారన్నారు. అయితే విద్యార్థులకు ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ బోర్డు బనగానపల్లె, డోన్ కళాశాలలో సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కళాశాలను ఎత్తివేయాలన్న ఉద్దేశంతోనే సీట్లు ఇతర ప్రాంతాలకు కేటాయించారని ఆరోపించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 12: నందికొట్కూరు పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాలుకా సమితి ఆధ్వర్యంలో పటేల్ సెంటర్‌లో సోమవారం ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యావాదుల పాలనకు సమాధి కట్టడంలో ఏఐఎస్ఎఫ్ అగ్రభాగాన నిలిచిందన్నారు. నాటి నుంచి నేటి వరకు దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడానికి పోరాటాల మార్గాన్ని ఎంచుకుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహా నంది, న్యాయసభ తాలుకా నాయకులు దినేష్, కిరణ్, వినోద్, చందు, విద్యార్థులు, మాజీ నాయకులు రఘురామమూర్తి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ప్రభుత్వం: మంత్రి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 12: ప్రజలకు ఏ సమస్య వచ్చినా టీడీపీ అండగా ఉంటుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాలలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తక్షణ పరిస్కారంపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి న్యాయ పరంగా త్వరగా సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లుఅన్నారు.

మంత్రిని కలిసిన సీఐ

నంద్యాల ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున గుప్తా సోమవారం నంద్యాలలో రాష్ట్ర మంత్రి పరూక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మంత్రికి సీఐ పుష్పగుచ్ఛాన్ని అందించారు. నంద్యాలలోని ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక ప్రణాళికలను చేపట్టి పరిష్కరించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.



వినతులను పరిశీలిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 12: రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మీకోసం ప్రజాసమస్యల పరిస్కారవేదిక కార్యక్ర మంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరంచారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన

హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే జయసూర్య సందర్శించి అక్కడి సమస్యలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలహారతి ఇచ్చి 5 పంపుల ద్వారా 1685 క్యూసెక్కుల నీటిని హంద్రీ నీవా కాలువకు విడుదల చేశారు. హంద్రీ నీవా ఈఈ సురేష్‌రెడ్డి, డీఈ చిన్నయ్య, ఎలక్ట్రికల్ డీఈ శాలిని, జేఈలు మహేంద్రారెడ్డి, సరితా, ఉదయశ్రీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీరు లేక రోగులు, సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. సోమవారం ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరై రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంబాబు పలు ప్రతిపాదనలను ఎమ్మెల్యే ముందు ఉంచారు. ప్రస్తుతం ఉన్న 30 పడగకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో శోభారాణి, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మీనాక్షిదేవి, కమిటీ సభ్యులు ప్రమీళ, సౌదీ చాంద్, స్టాఫ్ నర్సు భువనేశ్వరి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన

కొత్తపల్లి: కొత్తపల్లిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరిశీలించారు. తహసీల్దార్ ఉమారాణి, టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, లింగస్వామి గౌడు, జడ్.వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, రామకృష్ణారెడ్డి, జానకి రాముడు, రహీంఖాన్, మోహన్ యాదవ్, దర్గయ్య, మారెన్నలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విభజన్ విభిషిక స్మృతి దివస్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 12: నంద్యాల రామక్రిష్ణా డిగ్రీ కళాశాలలో బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ డా. భిరుచి మధు ఆధ్వర్యంలో సోమవారం విభజన్ విభిషిక స్మృతి దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధు మాట్లాడుతూ దేశ విభజన అనంతరం ప్రాణాలు కోల్పోయిన సోదర, సోదరీమణులను స్మరించుకుంటూ ఆగస్టు 14వ తేదీని దేశ విభజన భయానక రోజుగా జరుపుకుంటారని చెప్పారు. 1947 నాటి దేశ విభజన విషయాలను వివరించారు. ప్రధాన వక్తగా రిటైర్డు ప్రిన్సిపాల్ చెన్నయ్య, డా. రామకృష్ణారెడ్డి, సుధాకర్, చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారం అందించాలి'

మహానంది, ఆగస్టు 12: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. సోమవారం మండలంలోని మహానంది, అల్లీనగరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పకళ, ఫాతిమా మేరి రాణి, ఉమాదేవి పాల్గొన్నారు.

రైలులో చోరీ

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 12: కాచిగూడ -గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో చోరి జరగడంతో బాధితులు నంద్యాల రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన శివశంకర్, అరుణశ్రీ, శ్రీకాంత్ హైదరాబాదులో ఓ శుభ కార్యానికి వెళ్లేందుకు శుక్రవారం రాత్రి మార్కాపురంలో గుంటూరు, కాచిగూడ ఎక్స్ ప్రెస్ ఎక్కి హైదరాబాదుకు వెళ్లారు. శుభకార్యం ముగించుకుని ఆదివారం రాత్రి హైదరాబాదు నుంచి కాచి గూడ, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో మార్కాపురానికి బయలు దేరారు. అర్ధరాత్రి ప్రయాణంలో అరుణశ్రీ హ్యాండ్ బ్యాగు అపహరణకు గురైంది. బ్యాగు చోరి జరగడంతో నంద్యాల రైల్వే స్టేషన్‌లో దిగి జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో పది తులాల బంగారు నగలు, ఒక సెల్‌ఫోన్ చోరికి గురైనట్లు జీఆర్పీ ఎస్ఐ జలీల్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

పగిడ్యాల, ఆగస్టు 12: కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్య కారుడు బండారు శేషన్న మృతదేహం సోమవారం లభ్యమైంది. ఉదయం నదిలో బంధువులు గాలింపు చర్యలు చేపడుతుండగా లభ్యమైనట్లు తెలిపారు. ముచ్చుమర్రి పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టమర్టం నిమిత్తం నదింకొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పగిడ్యాల తహసీల్దార్ శివ రాముడు మంగళవారం నెహ్రూనగర్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. మత్స్యకా రుడి కుటుంబ వివరాలను, జీవన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని నదీతీర ప్రాంతాన్ని పరిశీలించారు. నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట వీఆర్వో వెంకటస్వామి ఉన్నారు.

తలారి కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు, ఆగస్టు 12: పాములపాడులో తలారి మల్లయ్య (60) సంలు అనారోగ్యంతో మృతి చెందారు. దహన సంస్కారాల కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.15 వేలు డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు తలారి కుటుంబ సభ్యులకు అందించారు. మల్లయ్య పాములపాడు తహసీల్దార్ కార్యలయంలో తలారిగా విధలు నిర్వహిస్తూండేవారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందడంతో ఆర్ఐ, వీఆర్వోలతో కలిసి మల్లయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. పరామర్శించారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

నంద్యాల రూరల్, ఆగస్టు 12: నంద్యాల మండల తహసీల్దార్‌గా ప్రియదర్శిని బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలకడ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై నంద్యాలకు వచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి నుంచి ఆమె పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు.

మహానంది: మహానంది మండల నూతన తహసీల్దార్‌గా రమాదేవి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు తహసీల్దార్ మహానంది ఆలయంలో భర్తతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బి.రామచంద్రుడు కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వచ్చిన రమాదేవిని మండల చౌకదుకాణం రేషన్ డీలర్లు శాల్వతో సత్కరించారు. మండలంలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది సహాయంతో కృషి చేస్తానని తహసీల్దార్ చెప్పారు.

పాములపాడు: పాములపాడులో ఎంపీడీవోగా గోపీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల ముందు బదిలీలో భాగంగా అనంతపురం జిల్లాకు బదిలీపై వెలల్లరు. ఎన్నికల అనంతరం సొంత జిల్లాకు తిరిగి వచ్చారు.

తహసీల్దార్‌ను కలిసిన జనసేన నాయకులు

వెలుగోడు, ఆగస్టు 12: వెలుగోడు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసగౌడ్‌ను సోమవారం జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలసి తహసీల్దార్‌కు పుష్పగుచ్చం అందించి సన్మానించారు. ఈసందర్భంగా వరాత మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలందించి మండల అభివృద్ధికి పాటు పడాలని వారు కోరారు. జనసేన మండల అధ్యక్షులు షాలు బాషా, పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌వలి, రాజేష్, తిమ్మయ్య, సుకన్య తదిరతులు ఉన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ

మహానంది, ఆగస్టు 12: ఎం.తిమ్మాపురంలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో ఎంపీడీవోవో శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయితీ కార్యదర్శులకు రిఫ్రెషర్ ట్రైనింగ్, శానిటేషన్, జీపీడీపీ ప్లాన్‌తో పాటు ఎల్ఈడీ స్ట్రీట్ లైట్ మేనేజ్‌మెంట్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. టీవోటీ భాస్కర్ గ్రామాల్లో పారిశుధ్యం కొరకు సర్పంచ్‌లు. పంచాయితీ కార్యదర్శులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శివనాగజ్యోతి, టీవోటీలు వెంకటయ్య, సుమంత్ పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: సర్పంచ్‌లు, కార్యదర్శులు సంయుక్తంగా పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో వాసుదవ గుప్తా, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నటరాజ్ సూచించారు. సోమవారం బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులుకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ముఖ్యంగా విదులు, నిధుల పట్ల అవగహన ఉండాలన్నారు. వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధి దోహద పడాలన్నారు. కార్యక్రమంలో హనీఫ్‌ఖాన్, వెంకటరాముడు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: సంపద సృష్టితోనే గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి మంజులావాణి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో సుగుణశ్రీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు రీఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ గ్రామాలలో లభ్యమయ్యే వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేయవచ్చన్నారు. సేంద్రియ ఎరువులు పంటలకు వాడడంవల్ల మంచి దిగుబడితో పాటు నేలకూడా సారవంతంగా ఉంటుందన్నారు. సేంద్రియ ఎరువులను రైతులకు విక్రయించడం వల్ల పంచాయతీలకు ఆర్థిక తోడ్పాటు అందుతుందన్నారు. పంచాయతీల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడంవల్ల పర్యావరణ సమతుల్యతను కాపాడడమే కాకుండా ఆర్థికంగా కూడా పంచాయతీలకు లబ్ధి చేకూరుతుందన్నారు. డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి దవోతరులు పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామ పరిపాలన, అభివృద్ధి ప్రణాళికపై మూడు రోజులపాటు జరగనున్న శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో నాగ అనసూయ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి



గోస్పాడులో శిక్షణ తరగతులకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఎంపీడీవో

ప్రణాళికకు తీసుకోవాల్సిన నియమాలు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేంద్రీయ ఎరువుల ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చే విధానాలను వివరించారు. గ్రామ అభివృద్ధిలో మొదట ఏ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అనే అంశాలపై ప్రాధాన్యత అంశాల గురించి వివరించారు. తాగునీటి సమస్యలేకుండా గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మేజర్ పంచాయతీ యాళ్ళూరు ఈవో సుబ్బారావు, సర్పంచ్‌లు కాటంరెడ్డి సుధామణి, పరదేశి ప్రమీళ, కోటిరెడ్డి, శివరామిరెడ్డి, కార్యదర్శులు ప్రసాద్, స్వర్ణ, ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో నూర్జహాన్ సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచులకు సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రణాళికలు తయారుచేస్తే దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించాలని, తాగునీటిట్యాంకు 15రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పగిడ్యాల: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో వివిద గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ విధానంపై అవగాహన కల్పించారు. అలాగే పారిశుధ్య పనులు, ఎల్ఈడీ లైట్ల నిర్వాహణకు సంబంధించి శరత్ కుమార్ గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నీటి కోసం ఇరు గ్రామాల రైతుల వాగ్వాదం

మిడుతూరు, ఆగస్టు 12: మండలంలోని జలకనూరు మద్దిగుండం చెరువు నీటి విషయంలో జలకనూరు, సుంకేసుల గ్రామాలకు చెందిన రైతులు సోమవారం వాగ్వాదానికి దిగారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ మోహన్ రెడ్డి, విద్యుత్ ఏఈ క్రాంతికుమార్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మద్దిగుండం చెరువును పరిశీలించారు. రైతులు ఏర్పాటు చేసిన మోటార్ల ద్వారా పైపులైన్లను పరిశీలన సమయంలో జలకనూరు, సుంకేసుల గ్రామాలకు చెందిన రైతులు మద్దిగుండం చెరువు దగ్గరకు వచ్చారు. కరెంటు మోటార్ల ద్వారా సుంకేసుల గ్రామ రైతులు పొలాలకు చెరువు నీరు వాడుకోవడం వల్ల చెరువులో నీరు తగ్గి తమ పొలాలకు నీరు అందక తీవ్రంగా నష్టపోతున్నామని జలకనూరు గ్రామ రైతులు అధికారులకు వివరించారు. తమ గ్రామ పొలిమేరలో ఉన్న చెరువు నీటిని తాము వాడుకోవడం వల్ల నీరు తగ్గడం లేదని, రెండు నెలల నుంచి తూము తెరిచి ఉంచడం వల్ల నీరు వృథాగా పోతోందని సుంకేసుల గ్రామ రైతులు చెప్పారు. గత 15 సంవత్సరాల నుంచి



రైతులను చెదరగొడుతున్న పోలీసులు

ఈ చెరువు నీటిని కరెంటు మోటార్ల ద్వారా వాడుకుంటున్నామని అధికారులకు వివరించారు. ఈ విషయంపై ఇరు గ్రామాల రైతులు ఒకరిపై ఒకరు మాటలు పెంచుకుని ఘర్షణ వాతావరణం నెలకొంది. అధికారులు పోలీసులు వెంటనే స్పందించి ఇరుగ్రామాల రైతుకు నచ్చచెప్పి అక్కడనుంచి పంపించారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ మోహన్ రెడ్డి మాట్లాడుతూ చెరువుకు మోటర్లు ఏర్పాటు చేసిన రైతులకు మొదట సుంకేసుల గ్రామంలో టాంటాం వేయించి తరువాత నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

'విద్యాభివృద్ధికి కృషి చేయాలి'



ఎమ్మెల్యే బుడ్డాకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

వెలుగోడు, ఆగస్టు 12: విద్యాభివృద్ధికి కృషి చేయాలని వెలుగోడు మండల యూటీఎఫ్ నాయకులు కోరారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని సోమవారం వేల్పనూరులో కలిసి వినతి త్రపం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక విద్యా రంగానికి గొడ్డలి పెట్టుగా మారిన జీవో నెంబరు 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కాపాడాలన్నారు. 1నుంచి 5వ తరగతి వరకు ఒకే చోట ఉండేలా చూడాలని వారు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆఒకే సిలబస్ మలు చేయాలని విద్యార్థి తనకు నచ్చిన మీడియంలో చదువుకునే వెసులు బాటు కల్పించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు తగ్గించి నాణ్యమైన ప్రమాణాలు పెంచడానికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్ నాగస్వామి నాయక్, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, రఫి, జాకీర్ హుసేన్, శ్రీనివాసులు, అహ్మద్ పాల్గొన్నారు.

బుడ్డా దంపతులకు అభినందనలు

వెలుగోడు, ఆగస్టు 12: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, సతీమణి బుడ్డా శైలజ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అభినందనలు వెల్లువెత్తాయి. సోమవారం వేల్పనూరులోని ఆయన నివాసానికి శ్రీశైల నియోజక వర్గం నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి టీడీపీ నాయకులు, అభిమానులు, బంధువులు, అధికారులు పలువురు విడివిడిగా వేల్పనూరు చేరుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సన్మానించగా మరి కొందరు కేకులు తెచ్చి కట్ చేయించారు.

'ఏకవచనంతో మాట్లాడడం సరికాదు'

నందికొట్కూరు, ఆగస్టు 12: సీపీఎం నాయకులను మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఏకవచనంతో దురుసుగా మాట్లాడడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. సీపీఎం కార్యాలయంలో సోమవారం సీపీఎం ప్రజా సంఘాల నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, రాజు, నాగన్న, శ్రీనివాసులు, అంజనేయులు, వేణుగోపాల్, దూదేకుల బాబు, బోయ నాయుడుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నందికొట్కూరు లోని పాండురంగస్వామి ఆలయ స్థలం వివాదంలో ఉండగా మెకానిక్ షెడ్లు వేసుకొని జీవిస్తున్న వారికి న్యాయం చేయాలని పోరాడుతుండగా అక్కడికి వచ్చిన బైరెడ్డి దురుసుగా వ్యవహరించారని అన్నారు. బెదిరించే ధోరణిలో మాట్లాడడం తగదన్నారు.

ఆత్మకూరు: నందికొట్కూరులోని పాండురంగ స్వామి దేవస్థానం ఎదురుగా ఎంతోకాలంగా చిరువ్యాపారులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని కోరిన ప్రజాసంఘాల నాయకులపై మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్, రామ్‌నాయక్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాసంఘాల నాయకులపై మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి దురుసుగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. ఇకనుంచైనా ప్రజాసంఘాల నాయకుల పట్ల గౌరవంగా మెలగాలని కోరారు.

సాధువులకు దుప్పట్ల పంపిణీ



సాధువులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీశైలం, ఆగస్టు 12: శ్రీశైలంలో దేవస్థానం పరిధిలోని పలువురు సాధువులకు సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు దుప్పట్లను పంపిణీ చేశారు. శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా శ్రీశైలం తెలుగుదేశం ఇన్‌చార్జి ఉండవల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శ్రీశైలం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కె.కృష్ణమాచారి 50 మంది సాధువులకు దుప్పట్లు, బ్రెడ్డును పంపిణీ చేశారు. నాయకులు బ్రహ్మయ్య, నాగరాజు ఆచారి, గోవిందయ్య ఆచారి, రామోహన్, నంబూరి పుల్లయ్య, శేషగిరి, వెంకటేశ్వర్లు, పెద్ద మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మిడుతూరు, ఆగస్టు 12: వీపనగండ్ల బాట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతి చెందారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన గద్దల బాలస్వామి కుమారుడు అవినాష్(18)తో కలిసి ఆదివారం నందికొట్కూరులో తన ట్రాక్టర్‌ను రిపేరు చేయించుకోవడానికి వెళ్లారు. పని పూర్తయిన తర్వాత తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అవినాష్ ట్రాక్టర్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాయ్యాయి. వెంటనే తండ్రి బాలస్వామి నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. అవినాష్ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

బియ్యం సీజ్.. ముగ్గురి అరెస్టు

నంద్యాల క్రైం, ఆగస్టు 12: నంద్యాల తాలుకా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.దస్తగిరిబాబు ఉత్తర్వుల మేరకు నంద్యాల తాలుకా అర్బన్ ఎస్ఐ నాగరాజు, నంద్యాల సివిల్ సప్లయ్ అధికారి ప్రసాద్, సిబ్బందితో కలిసి 120 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. నంద్యాల ఆటోనగర్‌లో హైవే బ్రిడ్జి కింద జంబులా పరమేశ్వరి దేవాలయం వద్ద పీడీఎస్ బియ్యాన్ని వెల్దుర్తికి చెందిన శోభన్‌బాబు అనే వ్యక్తి చెప్పినచోటకు తరలించాలని లారీ యజమాని చాకలి మధుకు చెప్పారు. కర్నూలు జిల్లా సిద్దగిరి మండలం గూడంపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చాకలి జనార్దన్ వెల్దుర్తిలో శోభన్‌బాబు సేకరించిన 120సంచుల బియ్యాన్ని లారీలో తరలిస్తుండగా దాడిచేసి ముగ్గురిని అరెస్ట్‌చేసి లారీని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. శోభన్‌బాబు చెప్పిన మేరకు నంద్యాల ఆటోనగర్ ఊరి బయట కంపచెట్ల వద్ద ఉన్న 25 సంచుల బియ్యం లోడ్ చేసుకొని వెల్దుర్తికి తరలిస్తే ఇద్దరం కలిసి కర్ణాటక రాష్ట్రం తీసుకుపోయి అక్కడ ఎక్కువ ధరకు అమ్ముకుందామని పన్నాగం పన్నారని చెప్పారు. శోభన్‌బాబు సూచనల మేరకు వెల్దుర్తినుంచి బయల్దేరి నంద్యాలకు వచ్చి ఆటోనగర్‌లో బియ్యం సంచులను లోడ్ చేసుకొని వెళ్తుండగా పోలీసులు చాకలి జనార్దన్‌ను అరెస్ట్‌చేసి 145 సంచుల్లో ఉన్న బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా స్థావరాలపై విస్తృత దాడులు

నంద్యాల క్రైం, ఆగస్టు 12: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో నాటుసారా బట్టీలపై పోలీసులు విస్తృత దాడులు చేశారు. ఈ దాడుల్లో 6కేసులు నమోదు చేసి 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నాలుగు డీపీఎల్ కేసులు నమోదు చేసి 18.79లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి 8 కేసులు నమోదు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 119ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆళ్లగడ్డ, ఆత్మకూరు డోన్ సబ్ డివిజన్లలో పేకాట ఆడుతున్న 24మందిని అరెస్ట్‌చేసి రూ.1,00,840 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మోటార్ వెహికల్ చట్టం కింద 136కేసులు నమోదు చేసి రూ.51,880జరిమానా విధించినట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పై కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ రోడ్డు భద్రతానిబంధనలు పాటించాలని సూచించారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది, ఆగస్టు 12: మహానందిలో భక్తుల కొరకు దేవస్థానం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా శేషారెడ్డి పల్లెకు చెందిన శివరాజారెడ్డి రూ.20 వేల విరాళం ఇచ్చినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానం విరాళాల కౌంటర్‌లో దాత నగదును అందజేశారు.

టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆళ్లగడ్డ, ఆగస్టు 12: ఆళ్లగడ్డ పట్టణంలో ఎమ్మెల్యే అఖిలప్రియ సమక్షంలో ఆమె నివాసంలో సోమవారం వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే అఖిలప్రియ నాయకత్వంపై నమ్మకంతోనే టీడీపీలో చేరామని ఆళ్లగడ్డ మున్సిపాలిటీ వైసీపీ కో ఆప్షన్ మెంబరు రమీజాబీ, వైసీపీ నాయకులు నజీర్‌హుశ్శేన్, మౌలాలి అన్నారు. తాము కేవలం ఇన్‌చార్జిలుగానే ఉన్నామని, తమ మీద నరసింహారెడ్డి, సుధాకరరెడ్డి పెత్తనం చెలాయించారని ఆరోపించారు. తాము ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పటికి దిష్టిబొమ్మల్లా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే అఖిలప్రియ నాయకత్వంపై నమ్మకంతోనే టీడీపీలో చేరామన్నారు. నాయకులు వలి, షర్ఫుద్దీన్, ఫారుక్, మస్తాన్, షమీమ్, శంషాద్, మాజీ కౌన్సిలర్ సలాం ఉన్నారు.

సీబీఎస్ఈ బేస్ లైన్ పరీక్ష కేంద్రం తనిఖీ



చాగలమర్రిలో బేస్‌లైన్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

చాగలమర్రి, ఆగస్టు 12: చాగలమర్రి గ్రామంలోని కేజీబీవీ, బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సీబీఎస్ఈ బేస్‌లైన్ పరీక్ష కేంద్రాన్ని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల సోమవారం తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 250 మంది విద్యార్థులు, కస్తూర్బా పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 40 మంది విద్యార్థినులకు ట్యాబ్‌ల ద్వానా బేస్‌లైన్ పరీక్ష నిర్వహించారు. పరీక్ష మొదట్లో సర్వర్ పని చేయక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. యాప్ డౌన్‌లోడ్ కాకపోవడంతో విద్యార్థులు గంట పాటు ట్యాప్‌ల ముందు నిరీక్షణ చేయాల్సి వచ్చింది. అనంతరం బేస్‌లైన్ పరీక్షలను యథావిధిగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటయ్య, సీనియర్ ఉపాధ్యాయులు, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాలలో జరిగిన బేస్‌లైన్ పరీక్షను ఎంఈవో ప్రతాప్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆదర్శ, పుచ్చకాయపల్లెలోని కేజీబీవీలోని పదో తరగతి విద్యార్థులకు బెస్‌లైన్ పరీక్ష నిర్వహించామని చెప్పారు. ఇంగ్లీషు, మాథ్స్, సోషియల్, సైన్స్ సబ్జెక్టులపై ట్యాబుల ద్వారా పరీక్ష నిర్వహిస్తున్నారని చెప్పారు. సర్వర్ సమస్య కారణంగా కేజీబీ విద్యార్థినులు 18 మంది విద్యార్థులు పరీక్షకు దూరమైనట్లు ఎంఈవో తెలిపారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

బేతంచెర్ల, ఆగస్టు 12: పట్టణంలోని బనగానపల్లె రహదారిలో ఓ వ్యక్తిపై పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని రాళ్లతో, కట్టలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమ వారం రాత్రి 9 గంటలకు చోటు చేసుకుంది. దుర్గాపేటకు చెందిన గర్జి శ్రీనివాసులు, బనగానపల్లె రహదారిలోని పాలిష్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి వస్తుండగా.. దారి కాచుకుని వున్న వ్యక్తులు రాళ్లతో కట్టలతో దాడి చేసి గాయపరిచి రహదారిపై వదిలి వెళ్లారు. అటువైపు నుంచి వస్తున్న స్థానికులు గమనించి గాయాలైన వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సంఘ టనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శివశంకర్ నాయక్ ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చి బాధితుని వివరాలు అడిగి తెలుసుకుని పరిశీలించారు. బాధితుడు గర్జి శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యుడు చరణ్‌రాజు ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు 108 వాహనంలో తరలిం చారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని దుర్గాపేట కాలనీకి చెందిన గ్రూప్ ఆఫ్ శివసాయి, మదన్‌లు కొట్టి గాయపరిచారని శ్రీనివాసులు తెలిపారు.

'గ్రామాల అభివృద్ధికి సహకరిస్తాం'

శిరివెళ్ల, ఆగస్టు 12: మండలంలోని గ్రామాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని టీడీపీ, జనసేన నాయకులు అన్నారు. శిరివెళ్ల ఎస్‌గా బాధ్యతలు చేపట్టిన చిన్న పీరయ్యను సోమవారం యర్రగుంట్ల ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు శీలం లక్ష్మీ ప్రసాద్, వెదుర్ల నాగేశ్వరరావు, సుబ్బరాయుడు సోమవారం కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అలాగే జనసేన నాయకులు పసుల నరేంద్ర, పెసరాయి చాంద్‌బాషా, ఇబ్రహీంఖాన్, పెద్ద బాలయ్య, జబివుల్లా, తేజ తదితరులు ఎస్ఐని సన్మానించారు.

సర్పంచ్‌లకు శిక్షణ

దొర్నిపాడు, ఆగస్టు 12: మండలంలోని ఆయా గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని దొర్నిపాడు మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ట్రైనర్ బాలాంజనేయులు శిక్షణ ఇచ్చారు.

చాగలమర్రి: గ్రామాల్లో సర్పంచ్‌లు ప్రణాళికాబద్ధంగా గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని జిల్లా పరిశీలకులు వెంకటరత్నం అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా తరగతులను ఎంపీడీవో మహబూబ్‌దౌల ప్రారంభించారు. డీపీఆర్సీ జిల్లా రిసోర్స్ పర్సన్ దస్తగిరిబాషా, రాజశేఖర్, ఆదినారాయణ, స్వర్ణకుమార్, ఏవో రాజేంద్ర ప్రసాదు పాల్గొన్నారు.

రుద్రవరం: పంచాయతీల అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో అబ్జర్వర్ కె.రత్నం మాట్లాడుతూ ప్రజల సహకారంతో పంచాయతీల అభివృద్ధి చేయాలన్నారు. ఎంపీడీవో మధుసూదనరెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: గ్రామపంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో సయ్యదున్నీసా, ఈవోపీఆర్డీ రాధికారెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణం లోని ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్లు సురేంద్ర, అశోక్, రాజశేఖర్‌లు పాల్గొని వారికి శిక్షణ ఇచ్చారు.

శిరివెళ్ల: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో కేవీ సుబ్రహ్మణ్యం అన్నారు. శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, ఈవోపీఆర్డీ నాగేం ద్రుడు, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్య దర్శులు పాల్గొన్నారు.

సంజామల: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయ్ కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎ.ఈ ఉపేంద్రా రెడ్డి, గౌస్, పంచాయతీ కార్యదర్శులు గోపీనాథ్, దినేష్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామ సర్పంచ్‌లదే కీలక పాత్ర అని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ తెలిపారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో గ్రామా సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా తరగతులను ఎంపీడీవో ఉమమహేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహీంధర్‌రెడ్డి, ఏవో పార్థసారధి పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రజలకు మెరుగైన పాలన అందించాలని ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

పేద విద్యార్థులకు న్యాయం చేస్తా: మంత్రి బీసీ





మంత్రి బీసీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, మంత్రికి పూల మొక్క అందజేస్తున్న తహసీల్దార్లు

కోవెలకుంట్ల, ఆగస్టు 12: రాష్ట్రంలోని పేద విద్యార్థులందరికీ న్యాయం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు ఎ.వెంకటసుబ్బయ్య, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు బాలనాగన్న కార్యకర్తలతో కలిసి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. 8వ తరగతి పూర్తయి నాలుగు సంవత్సరాలు, పదో తరగతి పూర్తయి రెండేళ్లు దాటిన ఎస్సీ విద్యార్థులకు విద్య అందిం చేందుకు కేంద్ర న్యాయసాధికార సంస్థ 2022 సంవత్సరంలో శ్రేష్ట స్కీం ప్రవేశ పెట్టిందని, ఈ స్కీం కింద చదువుకున్న విద్యార్థులను నాన్ లోకల్‌గా పరిగణించి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని అన్నారు. దీనిపై మంత్రి స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి పేద విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి బీసీని కలిసిన బాలకృష్ణ ఫ్యాన్స్ ప్రెసిడెంట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దనరెడ్డిని సోమవారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోవెలకుంట్ల పట్టణానికి చెందిన బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాసిం టీడీపీ కార్యకర్తతో కలిసి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డ్రైవర్ జిలాన్, బాబా ఫకృద్దీన్, షేక్ పెద్దవల్లి, చిన్నపఠాన్, ఖాన్, షేక్ హుసేన్, బాషా, వేణు, అన్వర్‌బాషా, వాసు, నాగరాజు, శ్యాంబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి : మంత్రి బీసీ

బనగానపల్లె: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు కృషి చేయాలని రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు మండలాల రెవెన్యూ కార్యాలయాలకు బదిలీపై వచ్చిన తహసీల్దార్‌లు నారాయణరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి మంత్రిని ఆయన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్క అందించి అభినందనలు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలి: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమ వారం అవుకు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రాజారెడ్డి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఇంటివద్ద మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందించి అభినందనలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



ఎమ్మెల్యే కోట్లను కలిసిన పోలీసు అధికారులు

డోన్, ఆగస్టు 12: డోన్ నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్లను బాధ్యతలు చేపట్టిన సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ నియోజకవర్గంలో మట్కా, పేకాట, నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు.

'జీవో 117ని రద్దు చేయాలి'

డోన్(రూరల్): జీవో నెంబర్ 117ని రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, కృష్ణనాయక్, లతీఫ్, సుంకన్న, బాలనాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కడపకు కృష్ణా జలాలు



జీఎన్ఎస్ఎస్ ద్వారా కడపకు తరలిపోతున్న నీరు

కొలిమిగుండ్ల, ఆగస్టు 12: అవుకు రిజర్వాయర్ నుండి కడప జిల్లా ప్రాజెక్టులకు నీరు విడుదల చేయడంతో గాలేరు-నగరి సుజల స్రవంతి కాలువ ద్వారా కృష్ణా జలాలు కడపకు పరుగులు తీస్తున్నాయి. రెండు రోజుల క్రితం అవుకు ప్రాజెక్టు వద్ద జీఎన్ఎస్ఎస్ హెడ్ రెగ్యులేటర్ గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని మంత్రి బీసీ జనార్దనరెడ్డి విడుదల చేశారు. దీంతో కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల నుంచి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా జలాలు కడకు తరలుతున్నాయి.

చెరువులకు జలకళ



ముత్యాలపాడు చెరువుకు చేరిన టీజీపీ నీరు

చాగలమర్రి, ఆగస్టు 12: మండలంలోని ముత్యాలపాడు, చింతల చెరువు, డి.వనిపెంట చెరువులకు టీజీపీ నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. నాలుగు నెలల నుంచి నీరు లేక ఒట్టిపోయిన చెరువులకు టీజీపీ నీరు చేరడంతో చెరువులు నిండుకుండలా ఉన్నాయి. ముత్యాలపాడు చెరువుకు నేరెళ్ల వాగు నుంచి టీజీపీ నీరు ప్రవహించింది. డి.వనిపెంట చెరువుకు భవనాశి ద్వారా నీరు ప్రవహించింది. టీజీపీ ప్రధాన కాలువ నుంచి బ్లాక్ చానల్ ద్వారా టీకేజీ నీరు చింతలచెరువు చెరువుకు చేరడంతో జలకళ సంతరించుకుంది. ఆయా చెరువులకు నీరు రావడంతో ఆయకట్టు సాగు చేసుకునేందుకు రైతులు నిమగ్నమయ్యారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

డోన్/ బనగానపల్లె/కోవెలకుంట్ల/కొలిమిగుండ్ల/అవుకు, ఆగస్టు 12: నంద్యాల జిల్లాలో డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, అవుకు తహసీల్దార్లు కే.నాగమణి, నారాయణరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, బాల ఈశ్వరరెడ్డి, మల్లికార్జురెడ్డి సోమవారం ఆయా కార్యాలయాల్లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ లకు అందు బాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానమన్నారు.

సీఐని కలిసిన బీజేపీ నాయకులు

ప్యాపిలి, ఆగస్టు 12: ప్యాపిలి సీఐగా బాధ్యతలు తీసుకున్న వెంకటరామిరెడ్డిని సోమవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ సమస్యలపై సీఐతో నాయకులు మాట్లాడారు. సీఐని కలసిన వారిలో బీజేపీ డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డె మహారాజ్, మండల కన్వీనర్ దామోదర్ నాయుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేసీ మద్దిలేటి ఉన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును టీడీపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. అనంతరం సీఐను శాలువ, పూలమాలతో సత్కరించారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, చంద్రశేఖర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎంపీడీవోగా మధుసూదనరెడ్డి

రుద్రవరం, ఆగస్టు 12: రుద్రవరం ఎంపీడీవోగా మధుసూదనరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కంటే ముందు కడప జిల్లా కాశినాయన మండలానికి బదిలీపై వెళ్లి తిరిగి ఇక్కడికే బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

'బాలికా విద్యాభివృద్ధికి కృషి'

చాగలమర్రి, ఆగస్టు 12: జిల్లాలో బాలికల విద్యాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా జీసీడీవో సువర్చల సూచించారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌వో సునీత ఉన్నారు.

'సమస్యలు పరిష్కరిస్తాం'

చాగలమర్రి, ఆగస్టు 12: సమస్యల పరిష్కారం కోసమే మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫిరెన్స్‌కు నెట్ సౌకర్యం లేక ఆయా శాఖల అధికారులు వారి సెల్‌ఫోన్‌ల ద్వారానే వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా తెలుసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఎంపీడీవో మహబూబ్‌దౌలా, ఏఈలు కొండారెడ్డి, షాజహాన్, జగ్గయ్య, ఏవో రంగనేతాజీ, ఎంఈవో న్యామతుల్ల పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

ఆళ్లగడ్డ, ఆగస్టు 12: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పెంచుకును పండ్ల తోటల పెంపకంపై జిల్లా డ్వామా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర రైతులకు అహోబిలంలో సోమవారం అవగాహన కల్పించారు. గ్రామంలో పండ్ల తోటలను సాగు చేసిన పొలాలను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో 20 రకాల పండ్లతోటలను సాగు చేసుకోవచ్చని చెప్పారు. ఏపీవో గణేష్, టెక్నికల్ అసిస్టెంటు పుల్లయ్య ఉన్నారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'

రుద్రవరం, ఆగస్టు 12: మండల ప్రజలకు గ్రామ రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ప్రజావేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని చెప్పారు. గ్రామాల్లోని ప్రజలు, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు రవీంద్ర ప్రసాద్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చాలి'



శిరివెళ్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

శిరివెళ్ల, ఆగస్టు 12: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు వసుంధర డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతోపాటు సమ్మె సమయంలో ఒప్పుకున్న హామీలను వెంటనే అమలు చేయాలంటూ శిరివెళ్లలో తహసీల్దార్ పుష్ప కుమారికి సోమవారం వినతి పత్రం అందజేశారు. విధుల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షలు చెల్లించి ఉద్యోగం కల్పించాలన్నారు. వర్కర్స్, హెల్పర్స్ ఖాళీలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో శిరివెళ్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాపిలి: డిమాండ్ల పరిష్కారం కోసం సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగవాడీ వర్కర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు భారతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు విజయ కుమారి, ఓబులమ్మ, పర్వానా, నీరజ, నాగమణి పాల్గొన్నారు.

డోన్(రూరల్): అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి అబ్బాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జులైఖ, కోశాధికారి ఏస్తరమ్మ, తాలుకా కార్యదర్శి స్వర్ణలతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆళ్లగడ్డ: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్ల, ఆయాల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు వసుంధరా దేవి, తిరుపతమ్మ డిమాండు చేశారు. ఈ మేరకు వారు ఆళ్లగడ్డ డిప్యూటి తహసీల్దార్ శేఖరయ్యకు సోమవారం వినతి పత్రం ఇచ్చారు.

చాగలమర్రి: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్ల అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చంద్రకళ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వేతనాలు పెంచి పీఎఫ్, ఇన్సూరెన్స్, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సంక్షేమ పథకాలు అందజేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

అవుకు ఆగస్టు 12: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా అన్నారు. సోమవారం అవుకు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని ల్యాబ్, ఫార్మసీ, వార్డులను తిరిగి పరిశీలించారు. కార్యక్ర మంలో ఆసుపత్రి సూపరిండెంట్ అభినయ్, డాక్టర్లు జయరాం, ఇంది రాకళ్యాణి, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిస్ట్రిక్ కోఆర్డినేటరు ఫర్ హాస్పిటల్స్ సర్వీసెస్ అధికారి డాక్టర్ జఫ్రుల్లా అన్నారు. సోమవారం కోవెలకుంట్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేసి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

'పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ'

ఉయ్యాలవాడ, ఆగస్టు 12: ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ ఇస్తున్నామని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల రైతులకు ఉపాధి ఏపీవో రవిప్రకాష్‌తో కలిసి మామిడి, కొబ్బరి మొక్కలను ఆయన పంపిణీ చేశారు. ఏపీవో మాట్లాడుతూ మండలంలో వంద ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈసీ షరీఫ్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో అభివృద్ధి పనులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 12: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో రూ.18 లక్షల నిధులతో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ అభివృద్ధి పనులు చేపట్టి, సోమవారం ప్రారంభించారు. గ్రామ టీడీపీ నాయకులు ఇటిక్యాల బాలిరెడ్డి, వైసీపీ నాయకులు శేఖరరెడ్డి విజ్ఞప్తి మేరకు ఎన్‌హెచ్-544డి ప్రధాన రహదారిలో రూ.10 లక్షల నిధులతో ప్రయాణికులకు బస్‌షెల్టర్, పాఠశాల ప్రాంగణంలో రూ.8 లక్షలతో భారీ షెడ్డు నిర్మించారు. రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, అడ్మిన్ ఇన్‌చార్జి రామరాజు, హెచ్ఆర్ జీఎం రవికుమార్ గ్రామ నాయకులతో కలిసి ప్రారంభించారు.

గుండె పోటుతో ఉపాధ్యాయుడి మృతి

కొలిమిగుండ్ల, ఆగస్టు 12: మండలంలోని కోటపాడు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాసరావు(48) సోమవారం గుండె పోటుతో మృతి చెందాడు. గత సంవత్సర కాలంగా కోటపాడు ప్రాథమిక పాఠశాలలో ఆయన విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం గుండె పోటుకు గురయ్యాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో, పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు హెచ్ఎం విశ్వేశ్వ రప్రసాద్ తెలిపారు.

60 లీటర్ల నాటుసారా స్వాధీనం

అవుకు, ఆగస్టు 12: అవుకు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన సుంకమ్మ అనే మహిళ నుంచి 60 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జోగేంద్ర సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల సెబ్ ఏఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బంది తో కలిసి నాటుసారా విక్రయదారుల ఇళ్లపై తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీల్లో సుంకేసుల గ్రామంలోని సుంకమ్మ ఇంటిలో నిల్వ ఉంచిన 60 లీటర్లు సారాను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. సుంక మ్మను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సెబ్ సిబ్బంది వెంకటరమణ, ప్రసన్న, పాములేటి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల, ఆగస్టు 12: కొత్త బస్టాండు సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు వద్ద నాటుసారా విక్రయిస్తున్న సారా విక్రేత శంకరయ్యను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి అక్రమ కర్ణాటక మద్యం 14 క్వార్టర్ బాటిల్స్, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి తెలి పారు. నిందితున్ని డోన్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

యునెస్కో గుర్తింపునకు ప్రతిపాదించాలి

అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలపై కేంద్ర మంత్రికి ఎంపీ లేఖ

ఆళ్లగడ్డ, ఆగస్టు 12: నంద్యాల పార్లమెంటు పరిధిలోని నల్లమల అడవుల్లో స్వయంభువుగా వెలసిన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాలకు యునెస్కో గుర్తింపునకు ప్రతిపాదించాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వాన్ని, మంత్రిత్వశాఖను సోమవారం కోరారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు అహోబిలం పార్వేట ఉత్సవాలకు యునెస్కో గుర్తింపునకు నామినేట్ చేయాలని కోరుతూ ఆమె ఉత్తరం రాశారు. ఏటా మార్చిలో జరిగే అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వార్ల కల్యాణోత్సవానికి అహోబిలేషుడే భక్తుల వద్దకువచ్చి ఆహ్వానించడం ఇక్కడ విశేషమని చెప్పారు. పార్వేట ఉత్సవాలల్లో భాగంగా ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల్లోని 33 గ్రామాలకు 45 రోజుల పాటు తరలి వచ్చి భక్తులను తన కళ్యాణానికి తరలి రావాలని పిలుపు నివ్వడం అద్భుత ఘట్టమని చెప్పారు.

'రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి'

శిరివెళ్ల, ఆగస్టు 12: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మహదేవపురం టీడీపీ నాయకుడు వెలుగోడు మహేష్ తహసీల్దార్‌ను కోరారు. శిరివెళ్ల తహసీల్దార్‌గా పుష్ప కుమారి బాధ్యతలు చేపట్టడంతో నాయకులు ఆమెను కలిసి సోమవారం సన్మానించారు. టీడీపీ నాయకులు శంకర్, మాలి బాషా, చిన్నా, మధు, దత్త, విక్టర్ ఉన్నారు.

మూడో విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

డోన్(రూరల్), ఆగస్టు 12: డోన్ ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం మూడో విడత ప్రవేశానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీలోపు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆయిల్‌ఫాం పంట సాగు లాభదాయకం

సంజామల, ఆగస్టు 12: ఆయిల్ ఫాం పంట సాగు లాభదాయకమని ఉద్యానవనశాఖ అధికారి ధరణి అన్నారు. తక్కువ ఖర్చుతో 20సంవత్సరాల పాటు రైతులకు ఈ పంట ఆదాయం ఇస్తుందన్నారు. సోమవారం ఆకుమళ్ల గ్రామానికి చెందిన శైలజ, శ్రీనివాసరెడ్డి, మూడు ఎకరాల పొలంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆయిల్ ఫాం మొక్కను నాటారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్ లిమిడెట్ జిల్లా మేనేజర్ మహదేవయ్య, పతాంజలి కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించండి

కొలిమిగుండ్ల, ఆగస్టు 12: కొలిమిగుండ్ల ప్రధాన రహదారి ఆక్రమణతో ఏర్పడిన ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలని కొలిమిగుండ్ల టీడీపీ నాయకులు గూడురు నాగేశ్వరరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి సీఐ రమేష్‌బాబుకు విజ్ఞప్తిచేశారు. సోమవారం నూతన సీఐ మద్దినేని రమేష్‌బాబును టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరరెడ్డి, చంద్రమోహన్‌యాదవ్, నాగేశ్వరరావు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'కౌలు కార్డులు పొందాలి'

రుద్రవరం, ఆగస్టు 12: మండలంలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో పంట పొలాలు సాగు చేస్తున్న రైతులు కౌలు కార్డులు పొందాలని ఏవో శ్రీకృష్ణ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు పొందితేనే అతివృష్టి అనావృష్టి వల్ల నష్టం జరిగితే పరిహారం అందుకోవడానికి అర్హులవుతారని చెప్పారు.

వాహనాల తనిఖీ

ప్యాపిలి, ఆగస్టు 12: పట్టణంలో మోటారు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. అధిక లోడుతో, లైసెన్స్‌లేని వాహనాలను పట్టుకొన్న ఇన్‌స్పెక్టర్ జరిమానా విధించారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

డోన్(రూరల్), ఆగస్టు 12: పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ హాస్టల్, పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు సుంక య్య, రాగుల రాముడు, మోట రాముడు, బద్దెల వెంకటేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్ పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సం ఘం జెండాను ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, నాయకులు రణత్‌యాదవ్, చంద్రశేఖర్‌నాయక్, మధు, కేశవ, విద్యార్థులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్



డోన్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.రవీంద్ర నాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భార్గవ్‌లు హాజరై ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు.